సాక్షి తిరుపతి

బుధవారం । 16 । జూలై । 2025



ఆలయం తమదేనంటూ ఆందోళన

శ్రీనివాస మంగాపురంలో కనకదుర్గ ఆలయం తమదేనంటూ ఇరువర్గాల మహిళలు మంగళవారం వాగ్వాదానికి దిగారు. - 8లో



ఫ్లస్‌టూ పల్టీ!

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో హైస్కూల్ ప్లస్ ప్రవేశాలు లేక వెలవెలబోతున్నాయి. సరైన వసతులు లేకనే ఈ దుస్థితి నెలకొంది. - 8లో



'మధ్యవర్తిత్వం'పై అవగాహన

దేశం కోసం మధ్యవర్తిత్వం అనే అంశంపై మంగళవారం జిల్లా అదనపు న్యాయమూర్తి అవగాహన కల్పించారు. - 8లో

న్యూస్‌రీల్

పాఠశాల చదువులకు అంగన్‌వాడీ పునాదులు



తాళ్వాయిపాడు అంగన్‌వాడీలో ఐసీడీఎస్ అధికారులు

పెళ్లకూరు : ప్రాథమిక పాఠశాల చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు పిల్లలకు అంగన్‌వాడీ పునాదులని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ వసంతబాయి పేర్కొన్నారు. మంగళవారం తాళ్వాయిపాడు, చిల్లకూరు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. చిల్లకూరులో నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. తాళ్వాయిపాడు అంగన్‌వాడీలో చిన్నారులకు అమలు చేస్తున్న మెనూ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమామహేశ్వరి, వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి పాలిసెట్ చివరి దశ కౌన్సెలింగ్

తిరుపతి సిటీ: ఏపీ పాలిసెట్–2025కు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియకు కౌన్సెలింగ్ చివరి దశ ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కౌన్సెలింగ్ కోఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని అభ్యర్థులు 19వ తేదీలోపు చెల్లించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే లేటరల్ ఎంట్రీ, బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసిన ఐటీఐ అభ్యర్థులు డిప్లొమో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. సీటు సాధించిన అభ్యర్థులు రూ.6 వేలు ఫీజు చెల్లించి అడ్మిషన్లు పొందాలని సూచించారు.

సీఎస్‌ఈకి..సై

ఇంజినీరింగ్ అంటేనే సీఎస్‌ఈ (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్) అనేలా విద్యార్థులు ఎక్కువ మంది ఈ బ్రాంచ్‌పైనే మక్కువ చూపుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఢోకా ఉండదని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పేరు పొందిన కంపెనీల్లో జాబ్ కొడితే రూ.లక్షల్లో ప్యాకేజీలు ఉంటాయనే ఆశతో సీఎస్‌ఈ బ్రాంచ్‌పై అందరి చూపు అటు వైపే నిలుస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు కళాశాలల్లో సీఎస్‌ఈ కోర్సు డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్నాయి. మేనేజ్‌మెంట్ సీట్ల పరిమితి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచుకొని రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఇప్పటికే పేరు పొందిన కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయనే ప్రచారం విద్యార్థుల్లో నడుస్తోంది.

వెబ్ ఆప్షన్లలో ఆ కోర్సుపై విద్యార్థుల మక్కువ

- సీఎస్‌ఈ తరువాత ఏఐ, డేటాసైన్స్, ఎమ్ఎల్, ఎస్ఎస్ కోర్సులకు డిమాండ్
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న ప్రైవేటు కళాశాలలు
- ఏడాదికి రూ.3 నుంచి రూ.4 లక్షలు వసూలు చేస్తున్న వైనం
- పేద విద్యార్థులకు దూరంగా సీఎస్‌ఈలోని అధునాత కోర్సులు
- మిగిలిన కోర్సులకు వెబ్ ఆప్షన్ పెడితే చాలు సీటు పక్కా





జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలల సమాచారం

ప్రభుత్వ కళాశాలలు	2
డీమ్డ్ వర్సిటీలు	2
అటానమస్ కళాశాలలు	5
ప్రైవేటు కళాశాలలు	11
మొత్తం సీట్ల సంఖ్య	23,080
సీఎస్‌ఈ బ్రాంచ్‌లోని అన్ని కోర్సులలో సీట్ల సంఖ్య	14,530
మిగిలిన సీఎస్‌ఈ, ఈఈఈ, మెకానికల్, కెమికల్ సీట్ల సంఖ్య	8,550

20 వేల మందికి ఇదే కోర్సుకు ..

ఇప్పుడంతా సీఎస్‌ఈ బ్రాంచ్ చుట్టూ తిరుగుతోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే ప్రచారంతో పాటు పేరొందిన కంపెనీలలో లక్షల ప్యాకేజీలతో మెట్రోపాలిటన్ సిటీలలో ఉద్యోగం లభిస్తుందన్న ఆశతో ఆ గ్రూప్‌నకు డిమాండ్ పెరుగుతోంది. ఇందులో ప్రధానంగా సీఎస్‌ఈ జనరల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్ టెక్నాలజీ వంటి కోర్సుల హవా కొనసాగుతోంది. జిల్లాలో సుమారు 25 వేల మంది వరకు ఏపీఈఏమ్‌సెట్ పరీక్షకు హాజరు కాగా ఇందులో 22,500 మంది అర్హత సాధించారు. ఇందులో ఇప్పటివరకు సుమారు 22 వేల మందికి పైగా విద్యార్థులు సీఎస్‌ఈ బ్రాంచ్‌లోని పలు కోర్సులకు దరఖాస్తు చేసుకున్నారంటే డిమాండ్ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

తిరుపతి సిటీ : జిల్లాలో ఇంజినీరింగ్ అడ్మిషన్ల హడావుడి ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎవరితో మాట్లాడినా వెబ్ ఆప్షన్ల ఎంపికపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏపీ ఈఏ ఎమ్‌సెట్–2025 వెబ్ ఆప్షన్ల ప్రక్రియ రెండు రోజుల నుంచి ప్రారంభం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతో నెట్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. సెట్‌లో మంచి ర్యాంకులు సాధించిన 90 శాతం మంది విద్యార్థులు సీఎస్‌ఈ గ్రూప్‌నే తమ వెబ్ ఆప్షన్లలో తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండవ ప్రాధాన్యంగా ఈసీఈ కోర్సును ఎంచుకుంటున్నారు. అయితే ఒకప్పుడు తిరుగులేని గ్రూపులుగా వెలుగొందిన ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సులపై కనీసం 10 శాతం మంది కూడా తొలి ప్రాధాన్యం ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో ఈ ఏడాది జిల్లాలో అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో కన్వీనర్ కోటాలో ఏదో ఒక కళాశాలలో సీటు పక్కా వచ్చేందుకు వీలుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రైవేటు కళాశాలలు సొమ్ము చేసుకుంటూ..

సీఎస్‌ఈ కోర్సుకు ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇదే అదునుగా రెచ్చిపోతూ ఫీజులు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. అన్ని ప్రైవేటు, కార్పొరేట్, డీమ్డ్, అటానమస్ విద్యా సంస్థలలో సీఎస్‌ఈ కన్వీనర్ కోటా సీట్లు తప్ప మేనేజ్‌మెంట్, పేమెంట్ సీట్లను పూర్తి స్థాయిలో ఇప్పటికే అమ్ముడు పోయాయి. ఏఐసీటీఈ గత ఏడాది సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను ఎత్తి వేయడంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా తమ కళాశాలలో డిమాండ్ ఉన్న కోర్సులకు సీట్లు పెంచుకుంటున్నాయి. కళాశాల స్థాయి, పేరు ప్రతిష్టల ఆధారంగా యాజమాన్యాలు ఒక్కో కోర్సుకు ఏడాదికి సుమారు. రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విద్యార్థుల నుంచి వసూలు చేసి కేవలం రూ.70 వేలకు రసీదులు ఇచ్చి పంపుతున్నారు. తిరిగి మాట్లాడితే విద్యార్థికి సీటు లేదంటూ వెనక్కి పంపుతారనే భయంతో తల్లిదండ్రులు ఏమీ చేయలేని స్థితిలో వారు అడిగినంతా ఫీజు చెల్లించి వెనుదిరుగుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాల ఇష్టారాజ్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న ఉన్నత విద్యామండలి అధికారులు ఏమీ చేయలేమని చేతులెత్తి కూర్చోవడం గమనార్హం.

పేదలకు దూరంగా అధునాతన కోర్సులు

డిమాండ్ ఉన్న కోర్సులుగా వెలుగొందుతున్న సీఎస్‌ఈ బ్రాంచ్‌లోని ఏఐ, డేటా సైన్స్, ఎమ్ఎల్, ఎస్ఎస్ కోర్సులు పేద విద్యార్థులకు అందనంత దూరంలో నిలిచాయి. ఏపీఈఏమ్‌సెట్‌లో సీటు సాధించినా ప్రైవేటు కళాశాలలో సీటు దొరకడం కష్ట తరమవుతోంది. లక్షలలో ఫీజుల చెల్లించలేని పేద విద్యార్థులు ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సుల వైపు మొగ్గ చూపుతున్నారు. సీఎస్‌ఈ కోర్సు కేవలం ధనవంతుల కోర్సుగా మిగిలిపోయిందని మేధావులు, విద్యావంతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏఐ కోర్సు చేయాలని..



ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్‌లలో సీఎస్‌ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చాను. ఏఐకి క్రేజ్‌తో పాటు భవిష్యత్తు ఉంది. కష్టపడి చదివితే మంచి ప్యాకేజీతో ఉన్నత స్థాయి ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఉంది. ఏఐ కోర్సుకు ఎస్వీయూ పరిధిలో పేరొందిన కళాశాలలకు తొలి ప్రాధాన్యతగా పెట్టుకున్నా.

–ప్రవల్లిక, విద్యార్థిని, తిరుపతి

డేటా సైన్స్, ఏఐ ఆప్షన్లు పెట్టాను



ఏపీఈఏమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. డేటా సైన్స్ లేదా ఏఐ చేయాలని ఉంది. ఈ క్రమంలో తొలి ప్రాధాన్యం డేటా సైన్స్, రెండో ప్రాధాన్యం ఏఐకి ఇచ్చాను. కచ్చితంగా నేను అనుకున్న కళాశాలలో సీటు వస్తుందని ఆశిస్తున్నా. ఫారిన్‌లో ఎమ్ఎస్ చేయాలని ఉంది.

– పృథ్వీ, విద్యార్థి, తిరుపతి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని..



సాఫ్ట్ వేర్ రంగంలో రాణించాలనేది నా చిన్ననాటి కోరిక. ఏపీఈఏ ఎమ్‌సెట్‌లో 3 వేల లోపు ర్యాంక్ సాధించా. కచ్చితంగా పేరొందిన కళాశాలలో సీఎస్‌ఈ జనరల్ సీటు వస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటికే వెబ్ ఆప్షన్ తొలి ప్రాధాన్యతగా సీఎస్‌ఈ జనరల్, రెండో ప్రాధాన్యతగా ఈఎసీఈకి ఇచ్చా.

– రజిని, విద్యార్థిని, తిరుపతి

బీసీ మహిళలకు రక్షణ కరువు

- కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై దాడి హేయం
- వైఎస్సార్‌సీపీ నేతల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు రక్షణ కరువైయిందని, అడుగడుగునా బీసీ మహిళలకు అవమానాలు చోటు చేసుకుంటున్నాయని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లాలోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ , జనసేన గూండాలు చేసిన దాడిని ఖండిస్తూ మంగళవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల్లపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలు, దాడులకు అంతులేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు చూసి చూడనట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. పోలీసులు కూటమి నేతల కీలుబొమ్మలా మారిపోయిందన్నారు. ఒక జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి జరుగుతుంటే పోలీసులు చోద్యం చూడటం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. హోంమంత్రిగా ఒక మహిళ ఉండి కూడా న్యాయం చేయడంలేదని మండిపడ్డారు. బీసీలంటే కూటమి ప్రభుత్వానికి ఎందుకంత చులకన అని మేయర్ ప్రశ్నించారు. గత జగనన్న పాలనలో బీసీ మహిళలకు ఉన్నత పదవులను కల్పించి ఉన్నత స్థాయిని కల్పించారని గుర్తు చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మాదవిరెడ్డి మాట్లాడుతూ.. ఉప్పాల హారికపై కూటమి గూండాలు దాడు చేస్తుంటే పోలీసులు చోద్యం చూడడం దుర్మార్గమన్నారు. మహిళలపై దాడులు చేస్తే తాటతీస్తానన్న పవన్‌కళ్యాణ్‌కు ఇలాంటివి కనబడవా? అని ప్రశ్నించారు. కూటమి గూండాలకు ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. ఉప్పాల హారికపై దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, ఆరణి సంధ్య, కోటమ్మ, ఆదిలక్ష్మి, పుణీత, కోటూరు అంజినేయులు, బోకం అనీల్‌కుమార్, తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, బీసీ నాయ కులు పుల్లయ్య, చిన్నియాదవ్, మల్లెమొగ్గల ఉమాపతి, పార్టీ నాయకులు తలారి రాజేంద్ర, ఉదయ్‌వంశీ, వాసుయాదవ్, మల్లం రవికుమార్‌రెడ్డి, దినేష్‌రాయల్, మద్దాలి శేఖర్, కడపగుంట అమరనాథరెడ్డి, పడమటికుమార్, పెరుగు బాబూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూలో ముగిసిన బ్రిడ్జి కోర్సు



ధ్రువపత్రాలతో బ్రిడ్జి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీలో పీజీ కోర్సులలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు వారం రోజులుగా నిర్వహించిన బ్రిడ్జి కోర్సు మంగళవారం ముగిసింది. వర్సిటీలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ మాట్లాడుతూ.. సంస్కృతంలోని 14 శాస్త్రీయ అంశాలపై విద్యార్థులకు వారం రోజుల పాటు పరిచయాత్మక బోధన చేశామన్నారు. విద్యార్థులు వర్సిటీలోని సదుపాయాలను వినియోగించుకుని ఉన్నత స్థాయి చేరుకుని వర్సిటీకి పేరు ప్రతిష్ట తీసుకురావాలని సూచించారు. అనంతరం బ్రిడ్జి కోర్సుకు హాజరైన విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాకరణ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ పంకజ్ కుమార్ వ్యాస్, డాక్టర్ యశస్వి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెప్మాలో అవకతవకలపై కమిటీ

తిరుపతి తుడా : తిరుపతి మూడో వార్డులో పార్వతీ పురంలో మహిళా సంఘాల సొమ్ముల అవకతవకలపై విచారణ కమిటీని నియమించినట్లు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కాజేసిన డ్వాక్రా మహిళల సొమ్మును రికవరీ చేయాలని మహిళా సంఘాలు, సీపీఐ, వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసి పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో మెప్మా అధికారులు స్పందించి విచారణ కమిటీని నియమించారు. కమిటీ నివేదిక మేరకు తగు చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.


వెటర్నరీ వర్సిటీలో కోర్సులకు దరఖాస్తులు

చంద్రగిరి : ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ పరిధిలోని పలు కళాశాలలో బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ అనిమల్ హస్బండరీ (బీవీఎస్) కోర్సుకు బుధవారం నుంచి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులు ఆగస్టు 5వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే వర్సిటీ పరిధిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో బీటెక్ డెయిరీ టెక్నాలజీ కోర్సులలో రైతు కోటా కింద ప్రవేశాలు పొందే అభ్యర్థులు ఆగస్టు 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో శిలాతోరణం వరకు బారులు తీరారు. సోమవారం అర్ధరాత్రి వరకు 74,149 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.72 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలో సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

పంటల బీమాపై అవగాహన కల్పించాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్

చంద్రగిరి : జిల్లాలోని రైతులందరూ 2025–26 గాను రైతులు స్వచ్ఛందంగా పంటల బీమాకు నమోదు చేసుకోవచ్చునని, ఇందు కోసం జిల్లా అధికారులు రైతులందరికీ అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ , ఉద్యాన శాఖల అధికారులతో పంటల బీమా పథకంపై డీఎల్ఎంసీ కమిటీ నిర్వహించారు. జిల్లాలోని ప్రతి రైతు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

బీమా ప్రీమియం వివరాలను వెల్లడించిన జేసీ

వరి పంటకు గ్రామాన్ని యూనిట్‌గా, సజ్జ పంటకు జిల్లాను బీమా యూనిట్‌గా పరిగణిస్తారని జేసీ తెలిపారు. వరి పంటకు ఒక హెక్టారుకు రూ.420 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా సజ్జ పంటకు హెక్టారుకు రూ.160 చెల్లించాలన్నారు. వేరుశనగకు హెక్టారుకు రైతు రూ.1400 , నిమ్మ పంటకు హెక్టారుకు రూ.6,250 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. వరి పంట ప్రీమియం కోసం ఆగస్టు 15వ తేదీలోపు, సజ్జకు జులై 31వ తేది, వేరుశనగ, నిమ్మ పంటలకు జులై 15లోపు ఇన్సూరెన్స్ చేయించుకునేందుకు చివరి తేదీ ఆయన తెలిపారు. అనంతరం ఆయన వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ అధికారులతో కలిసి పంటల బీమా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి దశరథ రామిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ గుంటూరు రవికుమార్, ఇన్సూరెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంగ కాలువలో మృతదేహం గుర్తింపు


గంగ కాలువలో తేలుతున్న మృతదేహం

సత్యవేడు : కొత్తమారి కుప్పం సమీపంలోని గంగ కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం కొత్తమారి కుప్పం పంచాయతీ ఇంద్రపురం సమీపంలోని గంగ కాలువలో మృతదేహం తేలుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని కాలువ గట్టుకు చేర్చారు. మృతుడి భార్య, కుమారుడు వచ్చి తొట్టంబేడు మండలం, చిన్న సింగమాలకు చెందిన మునస్వామి(58)గా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గురుకులంలో మిగులు సీట్లకు కౌన్సెలింగ్ రేపు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ జిల్లా సమన్వయకర్త టి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు గురువారం ఉదయం 10 గంటలకు చిత్తూరులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ సొసైటీ (పుత్తూరు రోడ్డులోని ఎంప్లాయిమెంట్ ఆఫీసు దగ్గర) కార్యాలయంలో జరగనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ఆటో బోల్తా : ఒకరి మృతి


మస్తాన్ (ఫైల్)

రాపూరు : రాపూరు–పెంచలకోన జాతీయ రహదారిలో మంగళవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన రాపూరు మండలం పెనుబర్తి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు ఇలా.. గోనుపల్లి నుంచి రాపూరునకు ఆటోలో ఏడుగురితో వస్తుండగా ఆటో పెనుబర్తి సమీపంలోకి రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న గోనుపల్లి గ్రామానికి చెందిన పసుపులేటి మస్తాన్(47) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన వారికి స్వల్ప గాయాలులైనట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్లస్‌టూ పట్టీ!



హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో ప్రవేశాలు లేక వెలవెలబోతున్నాయి. కూటమి ప్రభుత్వం వీటిపై పెద్దగా పట్టించుకోకపోవడంతో వసతులు, అధ్యాపకుల కొరతతో విద్యార్థులు కళాశాలల్లో చేరేందుకు విముఖత చూపుతున్నారు. ఫలితంగా పలు కళాశాలల్లో అరకొర ప్రవేశాలతోనే కాలం వెల్లదీయాల్సిన అగత్యం ఏర్పడింది.

- జిల్లాలోని 17 కళాశాలల్లో అడ్మిషన్లు శూన్యం
- మిగిలిన వాటిలోనూ అరకొరగానే ప్రవేశాలు
- వసతులు లేక విద్యార్థుల వెనకడుగు

తిరుపతి ఎడ్యుకేషన్ : గ్రామీణ ప్రాంతాల్లోని బాల, బాలికలకు కళాశాల విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జాతీయ విద్యా విధానంలో భాగంగా 2022లో అప్పటి ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ప్రవేశ పెట్టింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలోని బాలికలు, పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌లుగా మార్పు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధన అందించేందుకు అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు డిప్లాయ్‌మెంట్ ద్వారా హైస్కూల్ ప్లస్‌లలో నియమించుకుని విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్లస్‌టూ కళాశాలల్లో అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయి. సరైన వసతులు కల్పించక, అధ్యాపకులను నియమించకపోవడంతో ఈ దుస్థితి నెలకొన్నట్లు విమర్శలు వస్తున్నాయి.

తిరుపతి జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లో 40 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. వీటిలో 25 బాలికలకు కాగా, మిగిలిన 15 కో–ఎడ్యుకేషన్. అయితే వీటిలో సరైన వసతులు, అధ్యాపకులు లేకపోవడంతో వీటిలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటిలో 17 హైస్కూల్ ప్లస్‌లలో కనీసం ఒక్క అడ్మిషన్ కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

ఒక్క అడ్మిషన్ కూడా పొందని కళాశాలలు

జెడ్పీహెచ్‌ఎస్ పద్మావతీపురం, జీహెచ్‌ఎస్ పెల్లకూరు, జెడ్పీహెచ్‌ఎస్ బాలాయపల్లి, జెడ్పీహెచ్‌ఎస్ ప్లస్ (బాలికలు) చిల్లకూరు, జెడ్పీహెచ్‌ఎస్ దగ్గవోలు, ఎస్‌ఏఎల్‌సీఈఎఫ్ హెచ్‌ఎస్ వాకాడు, జెడ్పీహెచ్‌ఎస్ పల్లమాల, జెడ్పీహెచ్‌ఎస్ దక్కిలి, జెడ్పీహెచ్‌ఎస్ చిట్టేడు, జెడ్పీహెచ్‌ఎస్ పాలమంగళం, జెడ్పీహెచ్‌ఎస్ అరిమేనుపాడు, జెడ్పీహెచ్‌ఎస్ చెంబేడు, జెడ్పీహెచ్‌ఎస్ కుప్పంబాదూరు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర) రేణిగుంట, జెడ్పీహెచ్‌ఎస్ పెద్దకన్నలి, జెడ్పీహెచ్‌ఎస్ సత్యనారాయణపురం, జెడ్పీహెచ్‌ఎస్ బాలిరెడ్డి పాళెంలలో ఒక్క అడ్మిషన్ నమోదు కాలేదు. జెడ్పీహెచ్‌ఎస్ పద్మావతీపురంలో గత ఏడాది 37 మంది అడ్మిషన్లు పొందగా ఈ ఏడాది ఒక్కరూ చేరలేదు. జెడ్పీహెచ్‌ఎస్ తిరుచానూరులో గత ఏడాది 63 విద్యార్థులు ప్రవేశం పొందగా ఈ ఏడాది ఆ సంఖ్య 12కే పరిమితమయ్యింది.

ప్రవేశాలు ఇలా..

2024–25 విద్యాసంవత్సరం			2025–26 విద్యాసంవత్సరం		
బాలురు	బాలికలు	మొత్తం	బాలురు	బాలికలు	మొత్తం
161	675	836	21	565	586

వసతులు, అధ్యాపకులు లేక..

ఒక్కో హైస్కూల్ ప్లస్‌లో అందుబాటులో ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపునకు 53 మంది చొప్పున 159 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ లెక్కన 40 హైస్కూల్ ప్లస్‌లలో కలిపి మొత్తం 6,360 సీట్లు ఉన్నాయి. అయితే గత ఏడాది 40 హైస్కూల్ ప్లస్‌లలో బాల బాలికలు 836 మంది అడ్మిషన్లు తీసుకోగా ఈ ఏడాది 586కు దిగజారింది. దీనికి వసతుల లేమి, అధ్యాపకుల కొరత ప్రధాన సమస్యలుగా ఉన్నాయంటూ విమర్శలు వస్తున్నాయి. ఈ హైస్కూల్ ప్లస్‌లలో ఒక్కో స్కూల్‌కు సుమారుగా 7 మంది వరకు టీచర్లు ఉండాలి. అయితే కొన్నింట్లో టీచర్లు ఉంటే విద్యార్థులు లేకపోవడం, విద్యార్థులుంటే టీచర్లు లేకపోవడం వంటి సమస్యను విద్యాశాఖ పరిష్కరించకపోవడంతో ఆ ప్రభావం అడ్మిషన్లపై పడుతోందని చెబుతున్నారు.

హైస్కూల్ ప్లస్‌లను పటిష్టం చేయాలి



సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ విద్య అభ్యసించలేని పేద విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన హైస్కూల్ ప్లస్‌లు విద్యార్థులకు గొప్ప వరం. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఉన్న హైస్కూల్ ప్లస్ వ్యవస్థను ఇప్పటి ప్రభుత్వం పటిష్టం చేసి కొనసాగించాలి. 100 మందికిపైగా పదో తరగతి విద్యార్థులున్న హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేయాలి. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ హోదాకు సమానమైన పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ)గా రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతి కల్పించి హైస్కూల్ ప్లస్‌లలో నియమించి ప్లస్‌టూ వ్యవస్థను బలోపేతం చేయాలి.

–ఎస్.బాలాజీ, రాష్ట్ర అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్), తిరుపతి

త్వరలోనే నియామకాలు



హైస్కూల్ ప్లస్‌లలో త్వరలోనే అధ్యాపకుల నియామకం జరగనుంది. దీనికి సంబంధించి రాష్ట్ర విద్యాశాఖకు కావాల్సిన అధ్యాపకుల పోస్టులు, ఇతర వసతుల కల్పనపై ఇదివరకే జిల్లా విద్యాశాఖ నుంచి వివరాలు అందించాం. ఆయా హైస్కూల్ ప్లస్ పరిధిలో ఉపాధ్యాయులు అడ్మిషన్ డ్రైవ్‌ను నిర్వహించి విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. హైస్కూల్ ప్లస్ ఆవశ్యకతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ఎక్కువ మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకునేలా చర్యలు చేపట్టాం.

– కేవీఎస్.కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ), తిరుపతి

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి లీగల్ : చెక్ బౌన్స్ కేసులో చిత్తూరు జిల్లా, నగరి మండలం, గుండ్రాజు కుప్పానికి చెందిన బాలప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సత్యకాంత్ కుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి, భవానినగర్‌కు చెందిన యువరాజ్ వద్ద బాలప్రసాద్ 2016 డిసెంబర్ 20వ తేదీ 12 లక్షల రూపాయలను అప్పుగా తీసుకొని ఐదు ప్రో నోట్లు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో బాల ప్రసాద్ 2019 నవంబర్ 8వ తేదీ అసలు, వడ్డీతో కలిపి 20 లక్షలా 4 వేల రూపాయలు విలువచేసే చెక్కును యువరాజ్‌కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో యువరాజ్ కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. దీంతో బాల ప్రసాద్‌కు ఏడాది శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే చెక్కు సొమ్ముకు వడ్డీ కలిపి 30 లక్షలా 29 వేల 993 రూపాయలు పరిహారం కింద బాల ప్రసాద్.. ఫిర్యాది అయిన యువరాజ్‌కు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

ముక్కంటి ఆలయంలో దళారీ వ్యవస్థ అరికట్టండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో దళారీ వ్యవస్థను అరికట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కత్తి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముక్కంటి ఆలయంలో ఇటీవల కాలంలో దళారీ వ్యవస్థ చాలా ఎక్కువైందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి దర్శనం కోసం వచ్చే భక్తులను దళారులు మోసగిస్తున్నారన్నారు. దళారీ వ్యవస్థ పెరగడంతో దాడులు చేసుకుంటూ ఆలయ పవిత్రతను మంట కలుపుతున్నారని ఆరోపించారు. దీని వెనుక ఎవరి హస్తం ఉందన్న విషయాన్ని పోలీస్ అధికారులు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఆలయ అధికారులు ఇకనైనా స్పందించి దళారీ వ్యవస్థను అరికట్టాలని కోరారు.

రిజర్వు ఫారెస్టులో రోడ్డు వేసి అక్రమ రవాణా


ట్రాక్ తొలిచి రోడ్డు వేసి గ్రావెల్ తరలింపు

చిట్టమూరు : మండలానికి తాగు, సాగునీరు సరఫరా అయ్యే తెలుగు గంగ 7వ బ్రాంచి కాలువ కరకట్టను కూటమి నేతలు తమ ధనార్జన కోసం తొలిచి రోడ్డు నిర్మించి టిప్పర్లతో గ్రావెల్ అక్రమ రవాణా సాగిస్తున్నారు. యాకసిరి పంచాయతీ పరిధిలోని రావిగుంట చెరువులో కూటమి నేతలు హిటాచీతో టిప్పర్లకు గ్రావెల్ నింపి తరలిస్తున్నారు. దీంతో తెలుగు గంగ కాలువలు ధ్వంసం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి నేతలు బరితెగించి రిజర్వు ఫారెస్ట్‌లో గ్రావెల్ రోడ్డు వేసి అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించకపోవడంపై మండల ప్రజలు మండిపడుతున్నారు.

జేసీ లాగిన్.. ఆశలు ఆగెన్!

కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం అర్హులందరికీ అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వివిధ సాకులతో నిరుపేదలపై అనర్హత వేటు వేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించినప్పటికీ సకాలంలో పరిష్కరించడం లేదని మండిపడుతున్నారు. ప్రధానంగా జాయింట్ కలెక్టర్ లాగిన్‌కు వెళ్లిన అర్జీలకు అతీగతీ లేకుండా పోతోందని వాపోతున్నారు.


గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన తల్లులు (ఫైల్)

- అర్హులకు సైతం అందని తల్లికి వందనం
- వివిధ కారణాలతో మొండిచేయి చూపుతున్న ప్రభుత్వం
- గ్రీవెన్స్‌లో అర్జీలు పెట్టుకుని ఎదురు చూస్తున్న అమ్మలు
- అన్ని అడ్డంకులు దాటినా.. జేసీ కార్యాలయం వద్ద బ్రేకులు

తిరుపతి అర్బన్ : తల్లికి వందనం పథకం కింద నగదు జమ కాకపోవడానికి రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయపు పన్ను, కరెంట్ బిల్లు అధికంగా రావడం వంటి కారణాలను అధికారులు చెబుతున్నారు. అయితే ఏదైనా చిన్న చిన్న పొరబాట్లు ఉంటే వాటిని సులభంగా పరిష్కరించి అర్హులకు పథకం ఫలాలు అందించాల్సి ఉంది. క్షేత్ర స్థాయిలో సచివాలయ పరిధిలోనే పరిష్కరించాల్సిన అంశాన్ని జేసీ లాగిన్ వరకు పంపుతున్నారు. ముందుగా తహసీల్దార్ ఆఫీస్, తర్వాత ఆర్డీఓ ఆఫీస్ ఆ తర్వాత జేసీ ఆఫీస్ అంటున్నారు. ఈ క్రమంలో జేసీ లాగిన్ అంటేనే ప్రజలు వామ్మో ఇక అయినట్లే అంటూ హడలిపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా పొరబాటున అర్హులకు అమ్మఒడి అందకుండా ఉంటే క్షేత్రస్థాయిలోనే పరిష్కారం చూపించేవారు. అయితే కూటమి సర్కార్‌లో చిన్న సమస్య పరిష్కారం కోసం జేసీ లాగిన్ అంటూ చేతులుదులిపేసుకుంటున్నారు. దీంతో పెద్దసంఖ్యలో తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

తిరుగుతూనే ఉన్నాం



మా కుమార్తె కీర్తి 7వ తరగతి చదువుతోంది. తల్లికి వందనం నగదు మా బ్యాంక్ ఖాతాలో జమకాలేదు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లు చూపడంతో జమ కాలేదని చెప్పారు. దాంతో 20 రోజుల క్రితం సచివాలయంలో అన్ని డాక్యుమెంట్స్‌తో దరఖాస్తు చేసుకున్నాం. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని చెప్పారు. అక్కడ క్లియర్ చేశాక, ఆర్డీఓ ఆఫీస్‌కు వెళ్లాలని చెప్పారు. అక్కడ కూడా అన్నీ క్లియర్ చేశాం. ఆ తర్వాత జేసీ లాగిన్‌లో క్లియరెన్స్ రావాలని చెప్పారు. 15 రోజులుగా జేసీ లాగిన్‌లోనే పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో జేసీ కార్యాలయ సిబ్బందిని కలిశాం. వారు ఒరిజినల్ డాక్యుమెంట్స్‌ను తీసుకురావాలని, అందులో డీఆర్‌ఓ ఇన్‌షియల్ వేసుకువస్తే...ఫైల్‌ను జేసీకి పెడతామని చెబుతున్నారు. ఇలా నెల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పని మాత్రం కాలేదు. – ఎం.మంజుల, విద్యార్థిని తల్లి, శ్రీకాళహస్తి

మాకు అందలేదు



నా కుమార్తె నజీరా 5వ తరగతి చదువుతోంది. మాకు తల్లికి వందనం నగదు అందలేదు. దీంతో విద్యాశాఖాధికారులను సంప్రదించాం. సచివాలయానికి వెళ్లాలని చెప్పారు. అక్కడికెళితే తమకు సంబంధం లేదని చెబుతున్నారు. రెక్కాడితేకానీ డొక్క నిండని బతుకులు మావి. ఇలా కార్యాలయాల చుట్టూ తిరగలేకపోతున్నాం. ఈ ప్రభుత్వంలో మాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు.

– ధనమ్మ, విద్యార్థిని తల్లి, కేవీబీపురం మండలం

ఇద్దరికి రూ.17వేలు వేశారు



నాకు కవలపిల్లలు. జోషిత్తు, జీవన్ 8వ తరగతి చదువుతున్నారు. అయితే తల్లికి వందనం పథకం కింద ఇద్దరు బిడ్డలకు రూ.30 వేలు రావాల్సి ఉంది. అయితే ఒక్కొక్కరికి రూ.8,500 చొప్పున 17వేలు మాత్రమే వేశారు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారులకు తెలియజేశాం. 20 రోజులుగా మండల ఆఫీస్‌కి తిరుగుతున్నాం. అయినా ప్రయోజనం లేదు.

– మోరా ప్రసూన, కమ్మవారి పాళెం, చిల్లకూరు మండలం

సమాధానం లేదు



పేద కుటుంబానికి చెందిన వాళ్లం. అయితే మాకు తల్లికి వందనం రాలేదు. మా కుమార్తె కుందన ఒకటో తరగతి చదువుతోంది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు తల్లికి వందనం ఇస్తామని చెప్పారు. ఆ హామీ మేరకు ఇవ్వాలని కోరుతున్నాం. అసలు మాకు ఎందుకు ఇవ్వలేదో ఎవరికీ తెలియదట. అసలు సమాధానం చెప్పేవారే లేరు.

– బోడిరెడ్డి నాగవేణి, నెమ్మళ్లగుంటపల్లె, రామచంద్రాపురం మండలం

ప్రభుత్వ పాఠశాలలో డీఈఓ ఆకస్మిక తనిఖీ


మాట్లాడుతున్న డీఈఓ కుమార్

చంద్రగిరి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, విద్యార్థుల హాజరు వివరాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నమోదును పెంచాలని, విద్యార్థుల ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తూ వారి విద్యా సామర్థ్యాలను పెంపొందించుకోవడంలో తోడ్పాటు అందించాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజనంలో నాణ్యతను పెంచి, పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. మునుపటి విద్యా సంవత్సరంలోని పదో తరగతి ఫలితాలను ప్రధానోపాధ్యాయులతో చర్చించి, ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లలిత కుమారి, హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలోనూ ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులు హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అందిస్తున్న విద్యపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో, చక్కటి విద్యను అందించడంపై ఆయన సంతృప్తి చెందడంతో పాటు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

17న ఐఐటీ ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం

ఐఐటీ ప్రాంగణంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భవనం


ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కామన్ ఇంకుబేషన్ సెంటర్ ఈనెల 17న ఉదయం 10.30 గంటలకు కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగుతుందని ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ సత్యనారాయణ తెలిపారు.

బడి బయట పిల్లలపై నిర్లక్ష్యం

చిల్లకూరు : పాఠశాలల విలీనం కావడంతో తీర ప్రాంతంలోని పలు పాఠశాలలోని గిరిజన పిల్లలు బడికి దూరమై తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయం వద్ద మంగళవారం బిక్షాటన చేస్తూ కనిపించారు. కొమవారిపాళెంలోని 6, 7 తగరతి విద్యార్థులు సుమారు 5 కి.మీ దూరంలోని చింతవరం ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుండడంతో కొంత మంది చదువులు మానేశారు. అలాగే 3 నుంచి 5 తరగతులు చదివే గిరిజన విద్యార్థులు 3 కి.మీ దూరంలోని మోడల్ స్కూల్‌కు వెళ్లలేక బడి బయటే ఉంటున్నారు. తూర్పుకనుపూరులోని సుమారు 10 మంది విద్యార్థులు చదువులకు దూరమై బిక్షాటన చేస్తూ కనిపిస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ–2 రవూఫ్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు మోడల్ స్కూల్‌లో వారిని చేర్పించడం జరిగిందన్నారు. త్వరలోనే రవాణా చార్జీలు ఇస్తారు. బడికి కొద్ది రోజులు కష్ట పడి వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వం'పై అవగాహన

శ్రీకాళహస్తి: పట్టణంలోని న్యాయస్థాన భవనంలో మంగళవారం దేశం కోసం మధ్యవర్తిత్వం అనే అంశంపై 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ న్యాయవాదులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ చేశారు. అనంతరం కోర్టు ఆవరణలో న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి అర్హమైన వివాహ వివాదాలు, ప్రమాద క్లెయిమ్‌లు, గృహహింస, చెక్‌బౌన్స్ కేసులు, వాణిజ్య వివాదాలు, సర్వీస్ విషయాలు, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రుణ రీకవరి కేసులు, భూసేకరణ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. దేశం కోసం మధ్యవర్తిత్వం పేరుతో దేశవ్యాప్తంగా ప్రచారం జరుగుతోందన్నారు. ఇది పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పూర్వక పరిష్కారాల కోసం కృషి చేస్తుందన్నారు. జాతీయ న్యాయసేవల అథారిటీ, సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం, సయోధ్య ప్రాజెక్టు కమిటీ నేతృత్వంలో జరుగుతోందన్నారు. ఈ ప్రచారం అన్ని తాలుకా, జిల్లా, హైకోర్టులలో తగిన కేసులను గుర్తించి పరిష్కారం, కోసం మధ్యవర్తిత్వ కేంద్రాలకు పంపడంపై దృష్టి పెడుతుందన్నారు.

ఆలయం తమదేనంటూ ఇరువర్గాల ఆందోళన

- కనకదుర్గమ్మ ఆలయంపై స్థానికులు, సింగు మహిళల మధ్య వివాదం
- భారీగా మోహరించిన పోలీసులు
- శ్రీనివాసమంగాపురంలో ఉద్రిక్తత


పోలీసులతో వాగ్వాదానికి దిగిన సింగు మహిళలు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. గత ఆరు నెలలుగా గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గమ్మ ఆలయం తమదేనంటూ స్థానికులు, సింగుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో రెండు రోజులుగా ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని డీఎస్పీ కార్యాలయానికి రావాలని సూచించారు. గ్రామ పెద్దలతో పాటు సింగు కుల పెద్దలు డీఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. అయితే సింగు మహిళలు పెద్ద సంఖ్యలో మంగళవారం ఆలయం వద్దకు చేరుకున్నారు. వారు వచ్చారని తెలుసుకున్న స్థానిక మహిళలు సైతం పెద్ద ఎత్తున గుమికూడారు. ఇరు వర్గాల మహిళలు ఒకరికొకరు ఎదురు పడటంతో వాగ్వాదానికి దిగారు. తరతరాలుగా మా గ్రామ దేవతగా ఉన్న ఆలయాన్ని సింగులు కాజేయాలని చూస్తున్నారంటూ స్థానిక మహిళలు ఆరోపించారు. ఏడాదిలో రెండుసార్లు వచ్చి పూజలు చేసుకునే వారని, ఇప్పుడు ఆలయమే తమదంటూ తప్పుడు పత్రాలను సృష్టించి, తమపై అక్రమంగా కోర్టులో కేసులు వేసినట్లు ఆరోపించారు. కొన్నేళ్లుగా సింగు కులస్తుల కులదైవమైన శ్రీకనకదుర్గమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నారని, అమ్మవారు ఇక్కడ వెలిశారే తప్ప, ఆలయ నిర్వహణ పూర్తిగా మా పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిందంటూ సింగు కులస్తులు తెలిపారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. సింగు మహిళలు పెట్రోల్ బాటిల్‌తో తెచ్చుకుని, ఆలయాన్ని తమకు ఇవ్వకపోతే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడతామంటూ హెచ్చరించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి మహిళ వద్ద ఉన్న పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇరు వర్గాలు ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని, డీఎస్పీతో చర్చించిన తర్వాత ఆలయం ఎవరికి చెందుతుందో తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అంత వరకు ఆలయంలోకి ఇరు వర్గాలు వెళ్లకూడదంటూ ఇరువర్గాల వారిని హెచ్చరించారు.